

ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ రోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు

సందర్శన..

శాడి శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు. సోంపేట డయాలసిస్ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. 15 మంది రోగులు డయాలసిస్ చేయించుకోవడానికి వెయిటింగ్‌లో ఉన్నారన్నారు. వీరికి డయాలసిస్ చేయించడానికి యూనిట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. -సోంపేట



కాశీబుగ్గ–చినబాడాం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో నష్టపోయిన నిర్వాసితులకు న్యాయం చేసేందుకు

పరిశీలన..

అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇళ్ల స్థలాల కోసం పలాస ఆర్డీవో గ్రంధి వెంకటేష్ సోమవారం స్థలాలను పరిశీలించారు. నెమలినారాయణపురం, పురుషోత్తపురం గ్రామాల్లో పర్యటించి స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, సర్వేయర్లు, ఆర్‌ఐలు ఉన్నారు. - పలాస



వజ్రపుకొత్తూరు మండలంలోని పాతటెక్కలి పంచాయతీ పామలవానిపేటకు జలజీవన్ మిషన్ శుద్ధజల పథకం పైప్

వినతి..

లైన్ నిర్మించాలని సర్పంచ్ తుంగాన సుశీల కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించారు. -వజ్రపుకొత్తూరు



సోంపేట మండలం అనంతపురంలో నిర్వహిస్తున్న వేద గాయత్రి మహాదేవ యజ్ఞాన్ని కేంద్రమంత్రి కె.రామ్మోహ

గాయత్రి యజ్ఞం..

న్‌నాయుడు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. -సోంపేట

క్లుప్తంగా

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

సోంపేట: ఎక్కడైనా మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబి అన్నారు. ఇస్కలపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్, సచివాలయ సిబ్బందితో కలిసి సోమవారం గొలుసు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వారం రోజుల్లో ఐదు బెల్టు దుకాణాలపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. బెల్టు దుకాణాలు మద్యాన్ని విక్రయిస్తే సంబంధిత షాపు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

వ్యాసరచన పోటీలు రేపు

పలాస: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలాస మండలం నీలావతి గ్రామంలో ఈ నెల 13న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఉద్దానం ప్రాంతం విద్యాభివృద్ధి వేదిక నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయం ఆవశ్యకత అనే అంశంపై హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై వక్తృత్వ, బాలల దినోత్సవానికి సంబంధించి చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

శాసనమండలి చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్సీ నర్తు



మోషెన్ రాజుతో ఎమ్మెల్సీ రామారావు

కంచిలి: రాష్ట్ర శాసనసభ చైర్మన్ మోషెన్ రాజును ఎమ్మెల్సీ నర్తు రామారావు అమరావతిలో మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను చైర్మన్‌కు వివరించారు.

హమ్మయ్య.. తారు రోడ్డు వేశారు



తారు రోడ్డు వేసిన దృశ్యం

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానానికి వెళ్లే మార్గంలో తారు రోడ్డు వేయడంతో భక్తులకు ఇబ్బందులు తప్పాయి. గత సోమవారం మల్లన్న దర్శనానికి వెళ్లిన భక్తులకు రాళ్లు గుచ్చుకుని ఇబ్బందులు పడిన వైనంపై 'భక్తుల అవస్థలు' అనే కథనం సాక్షిలో వెలువడింది. దీంతో అధికార యంత్రాంగం త్వరితగతిన పనులు చేపట్టి తారు రోడ్డు వేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



తిప్పన పృథ్వి (ఫైల్)

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం జాతీయ రహదారి–16పై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన తిప్పన పృథ్వి (22) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పృథ్వి ఒక వాహనంపై.. మరో ఇద్దరు స్నేహితులు వేసే వాహనంపై ఇచ్ఛాపురం వచ్చారు. అక్కడ వారి పనులు ముగించుకొని తిరిగి తిప్పనపుట్టుగ గ్రామానికి వెళ్తుండగా స్కైబ్రాప్ కూడలిలో పృథ్వి వాహనంతో రోడ్డు దాటుతుండగా బరంపురం నుంచి సోంపేట వైపు వెళ్లే గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రగాయాలైన పృథ్విని స్థానికుల సహాయంతో తోటి స్నేహితులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు. యువకుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి అమ్మ అన్నపూర్ణ, నాన్న నారాయణలు ఉన్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

కాశీబుగ్గ: ఇంటిముందు ఉంచిన తన బైక్ చోరీకి గురైందని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వవార్డు పురుషోత్తపురం గ్రామానికి చెందిన బొంతు జయరాం సోమవారం ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి ఇంటి ముందు హ్యాండిల్ లాక్ వేసి ఉంచిన ద్విచక్ర వాహనం సోమవారం ఉదయం చూసేసరికి లేదని ఫిర్యాదు పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

గణిత అవధానికి సత్కారం

కంచిలి: సోంపేట మండలం బూరగాం గ్రామానికి చెందిన ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుడు మద్దు తిరుపతిరావుకు గణిత దశావధానంలో సత్కరించారు.

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో విజ్ఞాన విహార్ పాఠశాలలో నిర్వహించిన గణిత అవధానం ఎంతగానో విద్యార్థులను ఆలోచింపజేసింది. అనంతరం వెయ్యి మందికి పైగా చిన్నారుల సందేహాలను నివృత్తి చేయడంతో ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం తిరుపతిరావును ఘనంగా సత్కరించారు.

క్రీడల్!

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- కాగితాలకే పరిమితమైన క్రీడా స్థలాలు



పునాదులకే పరిమితమైన మినీ స్టేడియం

కాశీబుగ్గ: విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. పలాస నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన 30 వేల మంది విద్యార్థులకు అవసరమైన క్రీడా సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. కాగితాలకే క్రీడాస్థలాలు పరిమితమవుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు సైతం నీటి మూటలుగా మారాయి. గతంలో నియోజకవర్గానికి ఒక మినిస్టేడియం అని చెప్పిన నాయకులు దాన్ని అమలు చేయలేకపోయారు. పలాస మండలంలో 80, వజ్రపుకొత్తూరులో 97, మందసలో 124 పాఠశాలలు ఉన్నాయి. అయితే ఎక్కడా సౌకర్యవంతమైన ఆటస్థలాలు లేవు. దీంతో పిల్లలు మైదానం ముఖం చూడని పరిస్థితి నెలకొంది. మందస కేంద్రంలో స్టేడియం కట్టిస్తామని చెప్పిన టీడీపీ నాయకులు ఆ హామీని మరిచిపోయారు.

పూర్తికాని మినీస్టేడియం

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీతోపాటు పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల క్రీడాకారులకు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో పలాస మండలం శాసనం గ్రామానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ జూనియర్, మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో మినీస్టేడియం నిర్మించాలని టీడీపీ నాయకులు భావించారు. రెండు కోట్ల రూపాయలతో పనులు చేపట్టాలనే ఉద్దేశంతో 2018 జూన్ 11వ తేదీన అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ శంకుస్థాపన చేశారు. అయితే ఆ తరువాత పట్టించుకోకపోవడంతో పునాదులకే మైదానం పరిమితమైంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తే శివాజీ కుమార్తె శిరీష పలాస ఎమ్మెల్యే అయ్యారు. అచ్చెన్నాయుడు మరోసారి మంత్రి బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇప్పుడైనా మైదానంపై దృష్టి సారిస్తారో..లేదోనని ఈ ప్రాంతీయులు చర్చించుకుంటున్నారు.



మంత్రి అచ్చెన్నాయుడు 2018లో ఆవిష్కరించిన శిలాఫలకం



భూమి పూజ చేస్తున్న అప్పటి మంత్రి అచ్చెన్నాయుడు, ప్రక్కనే శివాజీ (ఫైల్)

పాలకులు శ్రద్ధచూపాలి



పలాసలో శంకుస్థాపనకే పరిమితమైన మినీస్టేడియంపై కూటమి నాయకులు శ్రద్ధ చూపించాలి. అర్ధాంతరంగా వదిలేసిన స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించాలి. ఎన్నికల వేళ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వదిలేయడం టీడీపీ ప్రభుత్వానికి అలవాటే. ఇప్పుడైనా స్టేడియం పూర్తి చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.

–మద్దిల వినోద్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పలాస–కాశీబుగ్గ

పునః నిర్మాణం కోసం డీఎస్‌డీవోతో మాట్లాడాం



ప్రతీ నియోజకవర్గానికి మంజూరైన క్రీడా మైదానం పనులు పలాసలో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీన్ని పూర్తిచేస్తే ఎంతోమంది విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది. ఈ విషయాన్ని డీఎస్‌డీవో దృష్టికి తీసుకుని వెళ్లాం. దానిపై సమీక్షించి తగిన స్పందన తెలియజేస్తామని బదులిచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి మైదానం పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాం.

– పట్టు తవిటయ్య, క్రీడల సమన్వయకర్త (ఇన్‌చార్జి), పలాస నియోజకవర్గం

• వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం విజయవాడలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలాసలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. - వజ్రపుకొత్తూరు

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఇచ్ఛాపురం క్రీడాకారిణులు

ఇచ్ఛాపురం: ఉత్తరప్రదేశ్ నిర్వహించనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఇచ్ఛాపురం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం రవణమ్మ సోమవారం తెలిపారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు జరుగనున్న పోటీలకు ఆర్.తనూజ, ఆర్.సరస్వతి, కె.కళ్యాణి ఎంపికయ్యారు. వీరిని సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటరమణ, వార్డు కౌన్సిలర్ బి.జగన్నాథం, కృష్ణయ్య, మాజీ ఆర్మీ అధికారి సుమన్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.



క్రీడాకారిణులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ప్రొఫైలింగ్ యాప్‌లో డ్వాక్రా మహిళల వివరాలు

కాశీబుగ్గ: డ్వాక్రా మహిళలంతా తమ వివరాలను ప్రొఫైలింగ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సీఎంఎం మోహన్ అన్నారు. జంట పట్టణాల్లో ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సంఘాల నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. సంఘాల నమోదులో పేర్లు తప్పులు లేకుండా సరిచూసుకోవాలని కోరారు. శ్రీగాయత్రి సమైఖ్య, సర్వభారతీ స్వయం శక్తి సంఘంలో సభ్యులు వివరాలు నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. 16వ వార్డు నెహ్రూనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సీవో బాలరాజు, ఆర్పీ పుణ్యవతి, సంఘ ఆర్గనైజర్ మీనాక్షి, సుజాత, సునీత, నాగమణి పాల్గొన్నారు.



వివరాల నమోదు ప్రక్రియలో స్వయంశక్తి సంఘాల సభ్యులు

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

కంచిలి: కత్తివరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నేషనల్ ఎడ్యుకేషనల్ డే వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవి బెహరా ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అదజేశారు. పాఠశాల ఆవరణలో నేషనల్ ఎడ్యుకేషనల్ డే రంగవల్లికను విద్యార్థులతో వేయించారు. దీని ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



నేషనల్ ఎడ్యుకేషనల్ డే వేడుకల్లో విద్యార్థినులు

వంశధార కాలువపై ఆక్రమణలు తొలగించండి

టెక్కలి: తలగాం గ్రామంలో వంశధార కాలువపై ఆక్రమణలు తొలగించాలని డి.శివరంగబాబు సోమవారం టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. పంట పొలాలకు సాగు నీరు అందజేస్తున్న 229/2 వంశధార కాలువపై కొంతమంది అక్రమంగా నిర్మాణాలు చేశారని.. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కక్షసాధింపులపై చర్యలు తీసుకోండి

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్
- ఆర్డీవోకు వినతి



ఆర్డీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న తిలక్, నాయకులు

టెక్కలి: రాజకీయ కక్ష సాధింపు చర్యలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు, దళితులపై చేస్తున్న కూటమి నాయకుల దాడులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ నాయకులతో కలిసి టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో హుదూద్ ఇళ్ల పట్టాలను రద్దు చేస్తూ అన్యాయమైన చర్యలకు పాల్పడుతున్నారన్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు రద్దు చేస్తున్నారని, ఇళ్ల బిల్లుల విషయంలో పక్షపాత ధోరణి అనుసరిస్తున్నారన్నారు. 136 పంచాయతీల్లో అన్యాయంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, వంట ఏజెన్సీ కార్మికులు, సీఎఫ్‌లు, శానిటేషన్ సిబ్బంది, చౌక ధరల దుకాణం డీలర్లు, పింఛన్లు నిలిపివేయడం, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, దళితుల ఇళ్లల్లో చొరబడి దాడులు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారంటూ కొన్ని సంఘటనలకు సంబంధించిన ఆధారాలను ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో బాధితులపైనే వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు పరిధి దాటితే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ.. తన పరిధిలో ఎక్కడా సామాన్యులపై అధికారకంగా ఎటువంటి ఇబ్బందికర చర్యలను ప్రోత్సహించమన్నారు. సంఘటనలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో తిలక్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రోత్సాహంతో కూటమి నాయకులు రెచ్చిపోయి దాడులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, నాలుగు మండలాల నాయకులు రోణంకి మల్లయ్య, సత్తారు సత్యం, ఎస్.హేమసుందర్‌రాజు, ఎం.నాగభూషన్, ఎ.రాహుల్, ఎం.గణపతిరావు, కె.సంజీవరావు, బి.మోహన్‌రెడ్డి, చిన్ని జోగారావు, జె.జయరాం, ఎస్.అప్పలస్వామి, ఆర్.జయమోహన్, బి.ఉదయ్, డి.కూర్మారావు, పి.మోహనరావు, కె.అప్పన్న, బి.వెంకటరమణ, పి.రామయ్య, టి.పాల్గుణరావు, బి.రాజేష్, భూషణ్‌రెడ్డి, డి.కుశుడు, రామారావు, వి.సింహాచలం ఉన్నారు.



టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు

శివోహం..



టెక్కలి: లింగాలవలసలో లింగరాజు స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని దూప..దీప నైవేద్యాలను స్వామికి నివేదించారు. క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తీక దీపాలను వెలిగించి నదులు, చెరువులు, సముద్రంలో విడిచిపెట్టారు. ఏకాహం భజన కాలక్షేపాలు, శివపార్వతుల తిరువీధులు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. -సాక్షి నెట్‌వర్క్



కంచిలి: తలతంపర ఆలయంలో పూజలందుకుంటున్న శివుడు



సంతబొమ్మాళిలో బారులు తీరిన భక్తులు



సోంపేట: బారువ కోటిలింగేశ్వర స్వామిదేవాలయం వద్ద క్యూలైన్లో భక్తులు

సంక్షిప్తంగా...

ఆఫ్‌షోర్‌కు నిధుల కేటాయింపుపై హర్షం

కాశీబుగ్గ: పలాస మండలంలోని ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి రూ. 35 కోట్లు మంజూరు చేయడం ఆనందంగా ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాను పలుమార్లు ఈ ప్రాజెక్టు పూర్తి చేసి రైతుల కష్టాన్ని తొలగించాలని చేసిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలన్నారు.

సిమెంటు బెంచీలు వితరణ

కంచిలి: బూరగాం గ్రామంలో కొలువై ఉన్న భోలా లింగేశ్వర స్వయంభూ దేవాలయానికి కంచిలికి చెందిన మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కొత్తకోట నాగరాజు, వసంత దంపతులు నాలుగు సిమెంటు బెంచీలను వితరణగా ఇచ్చారు. వీటిని సోమవారం ఆలయ కమిటీకి అప్పగించారు. వీటిని శివాలయం ప్రాంగణలో అమర్చారు.

ఫిష్‌షెడ్డులకు నిధులు మంజూరు చేయాలని వినతి

కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాల్లో చేపలు ఆరబెట్టుకొనేందుకు ఫిష్‌షెడ్డుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు మత్స్య సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కోటబొమ్మాళిలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. సూరాడ దాసురాజు, ఎస్.ధనరాజు, వి.సోమేశ్వరరావు, ఎస్.రాజు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: రోడ్డు నిబంధనలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నంనాయుడు అన్నారు. రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో మండపల్లి గ్రామ పంచాయతీలో స్థానిక ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించా మాట్లాడారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ డ్రైవింగ్ చేయరాదని అన్నారు. మహిళలను వేధించేవారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఎస్ఐ ఇ.శ్రీనివాస్, సర్పంచ్ పిట్ట శశిరేఖ, పిట్ట మామయ్య తదితరులు పాల్గొన్నారు.

సొండిపూడిలో వ్యాసరచన పోటీలు



బహుమతులు అందుకుంటున్న విజేతలు

కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి జెడ్పీ హెచ్ పాఠశాలలో జాతీయ సంపద సృష్టిలో దేశ సమగ్రత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. విజేతలుగా మట్ట హర్ష, జె.నిహారిక, పి.పావని మొదటి మూడుస్థానాల్లో నిలవగా.. వై మధుప్రియ కన్సోలేషన్ బహుమతులను గెలుచుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర్ సల్మాన్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధి కోన శేఖర్, మేనేజర్ కె.రఘుపతిరావు, జూనియర్ ఇంజినీర్ ఇ.అప్పలనాయుడు పాల్గొన్నారు.

పశుగణన సర్వే పరిశీలన

కోటబొమ్మాళి: కిష్టుపురం గ్రామంలో జరుగుతున్న పశుగణన సర్వే ప్రక్రియను కోటబొమ్మాళి పశుసంవర్ధకశాఖ ఏడీ మంద లోకనాథం సోమవారం పరిశీలించారు. కోటబొమ్మాళి మండలంలోని 38 పంచాయతీల్లో పశువులు పెంచుతున్న 19,101 కుటుంబాలను సర్వే చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకూ ఏడు గ్రామాల్లో 846 కుటుంబాల సర్వే పూర్తయిందని ఏడీ తెలిపారు. కార్యక్రమంలో కురుడు పశువైద్యుడు లఖినేని కిరణ్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంటు సీహెచ్ బాలమ్మ ఉన్నారు.

రావివలసలో భక్తుల అవస్థలు

టెక్కలి: మండలంలోని రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు అవస్థలు పడ్డారు. దర్శనం అనంతరం భక్తులంతా బయటకు వెళ్లడానికి ఒకే మార్గం ఉండటంతో రద్దీ ఎక్కువై అవస్థలు పడ్డారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు కిక్కిరిసి బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఒకే ఉచిత ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయడంతో రద్దీ తప్పలేదు. ఏర్పాట్ల విషయంలో దేవదాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పలువురు భక్తులు మండిపడ్డారు.



దర్శనం అనంతరం బయటకు వెళ్లేందుకు భక్తుల అవస్థలు